
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు


శనివారం 18 మే 2024



సర్వభూపాల, సింహవాహనాలపై ఊరేగిన చెన్నకేశవుడు



ధర్మవరం, మే 17: పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల మూడోరోజు శుక్రవారం స్వామివారు.. సర్వభూపాల, సింహవాహనాలపై విహరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి, ఉదయం సర్వభూపాల, సాయంత్రం సింహవాహనాలపై ఊరేగించారు. అన్నమయ్య సేవామండలి ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. శనివారం ఉదయం కల్పవృక్ష, సాయంత్రం హనుమద్వాహనంపై స్వామివారు.. భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.



సర్వభూపాల వాహనంపై ఆశీనుడైన చెన్నకేశవుడు

సింహవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

స్ట్రాంగ్ రూంల వద్ద ప్రత్యేక భద్రత
రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి, మే 17: జిల్లాల్లో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా.. జిల్లా అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రధాన ఎన్నికల అధికారి.. జిల్లా కలెక్టర్, ఎస్పీతో సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, డీఆర్వో కొండయ్య పాల్గొన్నారు. కౌంటింగ్ కేంద్రాలతోపాటు జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా భద్రత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

హుసేన్‌పురం ఘర్షణ..
ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు

చిలమత్తూరు, మే 17: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈనెల 13న మండలంలోని హుసేన్‌పురంలో తలెత్తిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ శుక్రవారం తెలిపారు. హుసేన్‌పురంలో పోలింగ్ రోజున వైసీపీ నాయకుడు, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, టీడీపీ నాయకుడు బాబురెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ తలెత్తిందన్నారు. ఇందులో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఎంపీపీ పురుషోత్తంరెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకుడు బాబురెడ్డి, మరో 18 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. టీడీపీ నాయకుడు బాబురెడ్డి ఫిర్యాదు ఆధారంగా ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, మరో 18 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందనీ, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

వైసీపీ మూకల దాష్టీకం
టీడీపీ కార్యకర్త గడ్డివామికి నిప్పు

రొద్దం, మే 17: మండలంలోని తురకలాపట్నం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బోయ తిమ్మయ్య గడ్డివామికి వైసీపీ మూకలు గురువారం రాత్రి నిప్పు పెట్టాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిమ్మయ్య ఇటీవల పది ట్రాక్టర్ల గడ్డిని కొనుగోలు చేసి, ఊరి బయట వాముగా వేసుకున్నాడు. గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. పెనుకొండ ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేశారు. గడ్డివాము కాలిపోవడంతో రూ.లక్షదాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేయగా.. తమ గడ్డివాము కూడా కాలిపోయిందని వెటకారంగా సమాధానం ఇచ్చినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వైసీపీ కార్యకర్తలే తన గడ్డివాముకు నిప్పు పెట్టారని రైతు ఆరోపించాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు.

నోటు ఇస్తేనే ఓటు!
పైసలిస్తేనే పోలింగ్ బూత్ వరకు వస్తామంటున్న ఓటర్లు

హిందూపురం, మే 17: స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి జరిగిన ఎన్నికలు ఒక ఎత్తయితే.. తాజా సార్వత్రిక ఎన్నికలు మరో ఎత్తు. గతంలో నచ్చిన అభ్యర్థికి ఓటువేసేవారు. నోట్లు ఇచ్చినా.. ఇవ్వకపోయినా.. అడిగే వారుకాదు. ఇష్టమొచ్చిన అభ్యర్థికి ఓటేసి, ఊరకుండేవారు. తాజా ఎన్నికలు ఇందుకు విభిన్నం. ఎన్నికల్లో కనిపించిన ఓ మార్పు అందరినీ ఆశ్చర్యానికి లోనుచేసింది. అదే ఓటుకు నోటు. ఇది ఎప్పటి నుంచో ఉన్నా ఇస్తే తీసుకునేవారు, లేదంటే వదిలేసేవారు. ప్రస్తుత ఎన్నికల్లో డబ్బు ఇవ్వాల్సిందేనన్నట్లుగా ఓటర్లు వ్యవహరిస్తున్నారు. ఇవ్వని అభ్యర్థుల కార్యాలయాలు, ఇళ్లవద్ద డబ్బుకోసం క్యూకట్టి నిరసనలు తెలపడం హిందూపురంలో ఇదే ప్రథమమని చెప్పవచ్చు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు తలెత్తలేదు. ఓటర్లకు డబ్బు పంచడం, తాయిలాలు ఇవ్వడం ఎప్పటి నుంచో రాజకీయ పార్టీల నాయకులు మూడో కంటికి కనబడకుండా రహస్యంగా జరిగిపోయేవి. ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. డబ్బు ఇవ్వకపోతే అభ్యర్థుల ఇళ్లవద్దకే వెళ్తున్నారు. ఫోన్లు చేసి మరీ అడుగుతున్నారు. ఓటర్లకు కిందిస్థాయి నాయకులు డబ్బు ఇవ్వడం లేదని గుర్తించిన అభ్యర్థులు ఈసారి రెండురకాల పద్ధతులు అనుసరించారు. ముందుగా ఓటర్లకు టోకన్ ఇవ్వడం, ఆ తరువాత ఎక్కడో ఓచోట వాటిని తీసుకుని, డబ్బు పంపిణీ చేయడం జరిగింది. కొన్నిచోట్ల నేరుగా ఓటర్ల ఇంటికే వెళ్లి ఓటరు స్లిప్పులను పరిశీలించి, డబ్బు ఇచ్చారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా పంచారు. ఎంతో మంది గ్రామస్థాయి నాయకులు, కొంత మొత్తం ఇచ్చి పంచమన్నారు. ఇక్కడి వ్యవహారం బెడిసి కొట్టిందని చెప్పవచ్చు. హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు ఇచ్చిన మొత్తాన్ని జేబులో పెట్టుకున్నారు. చిన్న మొత్తాలైతే ఎవరూ పట్టించుకోరు. కొన్ని ప్రాంతాల్లో ఓటుకు రూ.2వేలు చొప్పున నాలుగైదు వేల మందికి ఇవ్వమని చెప్పారు. ఆ లెక్కన రూ.కోటికిపైగా అవుతుంది. దీంతో కొంత మంది కౌన్సిలర్లు, నాయకుల ఇంటివద్దకు వెళ్లి కొంతమొత్తాన్ని ఇచ్చారు. మిగిలిన మొత్తం ఎందుకు ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. పక్కింట్లో వేలాది రూపాయలు ఇచ్చి తమకెందుకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇవ్వకుంటే నిరసనలు..

నాయకుల ఇళ్లు, కార్యాలయాల ముట్టడికి దిగుతున్న వైనం

విపరీత ధోరణిపై సర్వత్రా ఆందోళన



హిందూపురంలో డబ్బుకోసం వైసీపీ నాయకుడి ఇంటిని చుట్టుముట్టిన ఓటర్లు (ఫైల్)



వైసీపీ కార్యాలయం ముందు ఓటర్ల ఆందోళన (ఫైల్)

నోటు ఇవ్వకపోతే ఓటు వేయం

గతంలో ప్రతిఫలం ఆశించకుండా ఓటువేసేవారు. ప్రస్తుతం డబ్బు ఇస్తేనే పోలింగ్ బూత్‌వరకు వెళ్తున్నారు. లేదంటే అక్కడ ఓటు వేయడానికి నిరాకరిస్తారు. దీంతో కొన్ని చోట్ల డబ్బు బాగానే పంచారు. మరికొన్ని చోట్ల ఇవ్వకపోవడంతో వారు ఓటువేయడానికి ముందుకురాని పరిస్థితి. మొదట నోటిస్తే ఓటేయడానికి వస్తామని ఖరాకండిగా చెప్పారు. దీంతో చేసేదిలేక కొన్నిచోట్ల డబ్బు ఇళ్లవద్దకే వెళ్లి పంచారు. మరికొన్ని ఇళ్ల వద్ద నాయకుల ఇంటి వద్దకు వచ్చి తీసుకున్నారు. ఏదైనా నోటు ఇవ్వకపోతే ఓటేయమని ఖరాకండిగా చెప్పారు.

ప్రలోభాలకు లొంగవద్దంటున్న అధికారులు



పెనుకొండలో మంత్రి నివాసం వద్ద ఓటర్ల నిరసన (ఫైల్)

ఒక వైపేమో అధికారులు 'ఓటు అమ్ముకోకూడదు. ప్రలోభాలకు లొంగకూడదని ఉపన్యాసాలు ఇస్తుంటారు. ఓటర్లలో మాత్రం అలాంటివి కనిపించలేదు. ఐదేళ్లకోసారి ఇస్తారు. వారు గెలిస్తే ఐదేళ్లు తమ వైపు చూడరనీ, అలాంటపుడు డబ్బు తీసుకోవడంలో తప్పేంటని సమర్థించుకుంటున్నారు. ఈసారి డబ్బు పంపిణీ సందర్భంగా అధికారులు కూడా చేతులెత్తేశారు. ఎవరిష్టం వారిదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా ఓటర్లు సైతం డబ్బుకోసం రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. తమకు డబ్బులిస్తేనే పోలింగ్ బూత్‌కు వస్తామనీ, లేదంటే ఓటు వేయమని చెప్పినట్లు తెలిసింది.

ఇళ్లు, కార్యాలయాల వద్ద నిరసన

ఈసారి డబ్బు ఇవ్వకపోతే తడాఖా చూపుతామని పోలింగ్‌కు ముందు రోజు అభ్యర్థుల కార్యాలయాలు, ఆయా పార్టీల నాయకుల ఇళ్లవద్ద ఓటర్లు నిరసన తెలిపారు. హిందూపురంలో వైసీపీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణంలోని కౌన్సిలర్ల ఇళ్లను ముట్టడించారు. పెనుకొండలో మంత్రి ఇంటివద్దకు వెళ్లి, టోకన్లు ఇచ్చి డబ్బు ఇవ్వలేదంటూ ఆందోళన చేశారు. ఈసారి ఎన్నికల్లో ఇలా జరగడానికి రాజకీయ పార్టీల నాయకులే కారణమన్న వాదనలున్నాయి. ఎందుకంటే అన్ని పార్టీలు ఓటుకు నోటు తీసుకోవాలని ప్రత్యక్షంగా ప్రోత్సహించాయి. నాయకులు బహిరంగ సభల్లో ఎన్నికల్లో డబ్బు ఇస్తే తీసుకోవాలని పార్టీల అధినేతలే చెప్పడంతో ఓటర్లు ఒక అడుగు ముందుకేసి, డబ్బు గుంజేయత్నం చేశారు.

సామాన్యులు పోటీచేయాలంటే కష్టమే

సార్వత్రిక ఎన్నికలను గమనిస్తే భవిష్యత్తులో సామాన్యులు పోటీచేయాలంటే కష్టమే. ఒకప్పుడు ప్రజాసేవ చేయడానికి ఎన్నికల్లో నిలబడేవారు. అప్పట్లో నిస్వార్థంగా ఓటర్లు కూడా ఓటు హక్కును వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఏ చిన్న ఎన్నికలు జరిగినా ఖర్చు రూ.లక్షల నుంచి రూ.కోట్లు అవుతోంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలైతే చెప్పనక్కర్లేదు. దీంతో భవిష్యత్తులో సామాన్యులు చట్టసభల్లోకి వెళ్లడం అసాధ్యంగానే కనిపిస్తోంది. రూ.కోట్లు ఖర్చుపెట్టుకుని ఎన్నికల్లో నిలబడతారు. గెలుస్తారా.. లేదా.. అనేది ఓటర్లపై ఆధారపడి ఉంటుంది. అలాంటపుడు ఇన్ని కోట్లు పెట్టి గెలవకపోతే తమ పరిస్థితి ఏంటని డబ్బున్న నేతలే వాపోతున్నారు. ఇక సామాన్యులు చట్టసభలకు వెళ్లాలనుకోవడం దురాశే అవుతుంది.

మడకశిరలో కుండపోత
జిల్లాలో పలుచోట్ల వర్షం
ఎండవేడిమి, ఉక్కపోత నుంచి ఉపశమనం

మడకశిరటౌన్/రూరల్/హిందూపురం అర్బన్, మే 17: ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం. జిల్లాలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. మడకశిర, రొద్దం మండలాల్లో గంటపాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మడకశిర పట్టణంలోని పలు రహదారులపైకి వర్షపునీరు భారీగా చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొత్త మసీదు, పావగడ రోడ్డు, మధుగిరి రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. మండలంలోని జమ్మానిపల్లి, చందకచర్ల, ఆమిదాలగొంది గ్రామాల పరిధిలో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. ఈ వర్షం సేద్యపు పనులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



హిందూపురంలో కూలిన చెట్టు

కూలిన చెట్టు

హిందూపురం అర్బన్: పట్టణంలోని నానెప్పనగర్ మూడో క్రాస్‌లో శుక్రవారం సాయంత్రం భారీ చెట్టు కూలిపోయింది. చిన్నపాటి గాలివానకు చెట్టు కూలి, విద్యుత్ తీగలపై పడింది. దీంతో నానెప్పనగర్ ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఎవరికీ ప్రమాదం లేకపోవడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాన్స్‌కో అధికారులు కూలిన చెట్టును తొలగించి, విద్యుత్ సరఫరా అందించే పనిలో నిమగ్నమయ్యారు.

రాబోవు నాలుగురోజుల్లో జిల్లాలో వర్షాలు

పుట్టపర్తి రూరల్: రాయలసీమ, ఉత్తర తమిళనాడు మీదుగా ఉపరితల అవర్తనం కొనసాగుతోందని దీని ప్రభావంతో రాబోవు నాలుగు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం ప్రకటనలో పేర్కొంది. ఈనెల 18, 19, 20, 21 తేదీలో జిల్లావ్యాప్తంగా ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. శుక్రవారం సాయంత్రం నాటికి జిల్లాలో నంబులపూలకుంట 84 మి.మీ, గాండ్లపెంట 60 మి.మీ, మడకశిర 50.7 మి.మీ, తనకల్లు 43.7 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపింది.



మడకశిరలో రోడ్డుపై భారీగా చేరిన వర్షపు నీరు.. మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామ సమీపాన పొంగి పొర్లుతున్న చెక్ డ్యాం

ఏపీటీఎఫ్-1938 జిల్లా కమిటీ ఎన్నిక

కదిరిఅర్బన్, మే 17: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్-1938) జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నాగిరెడ్డి, అధ్యక్షుడిగా బడా హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాలవ సురేంద్ర, అసోషియేట్ అధ్యక్షుడిగా నర్సిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా పలువురిని ఎన్నుకున్నారు.



అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి



ప్రధాన కార్యదర్శి సురేంద్ర

మండుతున్న కూరగాయల ధరలు



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న కూరగాయల దుకాణం

బీన్స్, బంగాళాదుంప రూ.200..
పచ్చిమిర్చి రూ.100..
బెండ, ముల్లంగి, చిక్కుడు, మునగ, బీర, ఇలా.. అన్నింటి ధరలు వందకు చేరువలో..
ఆకాశాన్నంటుతున్నాయి..
సరుకుల పరిస్థితీ అంతే..
ధరలు దడ పుట్టిస్తున్నాయి..
దీంతో దుకాణానికి వెళ్లాలంటేనే భయపడాల్సిన దుస్థితి..

ధరల దడ!



కదిరిఅర్బన్, మే 17: ఇప్పటివరకు ఎండ దెబ్బకు భయపడిన ప్రజలు తాజాగా కూరగాయల ధరలకు బెంబేలెత్తుతున్నారు. రోజురోజుకీ పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యులకు పెనుభారంగా మారుతున్నాయి. గతంలో కిలోకి వెచ్చించిన ధరతో ఇప్పుడు కనీసం పావు కిలో రావడంలేదని వాపోతున్నారు. మార్కెట్‌కు వెళ్లాలంటే పేద, మధ్యతరగతి ప్రజలు జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. బెండ, టమోటా, బీన్స్, వంకాయ ఇలా.. ఒకటేమిటి అన్ని కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిత్యవసర సరుకుల ధరలు సైతం కొండెక్కడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బెంబేలెత్తుతున్న వినియోగదారులు

పేద, మధ్యతరగతిపై పెను భారం

తగ్గిన సాగు

కదిరి ప్రాంతంలో వివిధ కూరగాయ పంటలు సాగవుతున్నాయి. ఇవి స్థానిక అవసరాలకు సరిపోవడంలేదు. పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించే వారపు సంతలకు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకొచ్చి, విక్రయిస్తున్నారు. సాగు గణనీయంగా తగ్గడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరలు మండుతున్నాయి. రూ.500 తీసుకెళ్లినా నాలుగు రకాల కూరగాయలు కూడా రావట్లేదు.

కొండెక్కిన ధరలు

మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బంగాళాదుంప, బీన్స్ కిలో రూ.రెండు వందలు పైమాటే. పచ్చిమిరప, కాకర రూ.వంద పలుకుతున్నాయి. బెండ, ముల్లంగి, బీరకాయ, చిక్కుడు, మునగ సెంచరీకి దగ్గరలో ఉన్నాయి. ఆకుకూరలు ధరలు కూడా భారీగా పెరిగాయి. పదిరోజులుగా కూరగాయల ధరలు పెరుగుతుండడంతో సామాన్య ప్రజలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

తగ్గిన దిగుబడి, పెరిగిన దిగుమతి...

గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వెంటాడింది. భూగర్భజల మట్టం పడిపోయి, చాలా బోరుబావులు వట్టిపోయాయి. దీంతో కూరగాయల సాగు విస్తీర్ణం జిల్లాలో దారుణంగా పడిపోయింది. చాలీచాలని నీటితో సాగుచేసిన పంటలు చాలాచోట్ల తీవ్ర ఎండలకు ఎండిపోయాయి. పంట చేతికొచ్చినా.. పలు చోట్ల దిగుబడి తగ్గిపోయింది. స్థానిక అవసరాలకు చాలినంత కూరగాయల దిగుబడి కూడా రాలేదు. వెరసి.. డిమాండ్ పెరిగింది. వ్యాపారులు కర్ణాటక నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు. రవాణా ఖర్చులు పెరగడంతో ధరలు పెంచాల్సి వస్తోందని వ్యాపారులు అంటున్నారు.

ఏం కొనేటట్టు లేదు

కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. ఏం కొనాలన్నా.. తినాలన్నా.. కిలో రూ.50పైమాటే. అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకుంటున్నాం. కూరగాయల ధరలు అందరికీ అందుబాటులో ఉండాలి. ధరలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాం.

\- సరస్వతమ్మ, గృహిణి, కదిరి

ఒక్కసారిగా ధరలు పెరిగాయి



కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఏం కొనాలన్నా.. ఆలోచించాల్సిన పరిస్థితి. ఇది సామాన్యులకు పెనుభారంగా మారింది. రూ.వెయ్యి పెట్టినా నాలుగు రోజులకు సరిపడా కూడా రావడంలేదు. వెంటనే ధరలను నియంత్రించాల్సి ఉంది.

\- శంకర్, కదిరి



ప్రస్తుతం కూరగాయల ధరలిలా..

కూరగాయ	కిలో (రూ.)
బంగాళాదుంప	200
బీన్స్	200
పచ్చిమిరప	100
కాకర	100
బెండ, ముల్లంగి, బీర, చిక్కుడు, మునగ	80
క్యారెట్, బీట్‌రూట్	60
వంకాయ	40
టమోటా	30

ప్రాంతం	పుట్టపర్తి		కదిరి		ధర్మవరం		హిందూపురం		పెనుకొండ	
గరిష్ఠం కనిష్ఠం	30.0	25.0	26.0	25.0	31.0	26.0	32.0	24.0	27.0	22.0

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



రామానాయక్ శ్రీనివాస నాయక్

అనంతపురం విద్య, మే 17 : ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రామానాయక్, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా రామాంజనేయులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పోతులయ్య, అదనపు కార్యదర్శిగా ఆంజనేయులు నాయక్, జిల్లా సబ్ కమిటీ సభ్యులుగా వజీర్ బాషా, సాయినాథ్ రెడ్డి, బహేశ్వర్, రామకృష్ణ, రమేష్‌రెడ్డి, మద్దిలేటప్ప, అశోక్ నాయక్, నాగార్జున, నారాయణరెడ్డి, నరసింహులును ఎన్నుకున్నారు. కొత్త సభ్యులకు రాష్ట్ర, జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.


దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 17: జీసస్ నగర్‌లోని మైనార్టీ ప్రీమెట్రిక్ బాలికల వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ రామసుబ్బారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వసతిగృహంలో 6 నుంచి 10వ తరగతి వరకు 100 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థినులు వసతిగృహానికి 5 కి.మీ. పరిధిలో ఉండాలని, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు దరఖాస్తుకు జతపరచాలని సూచించారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, పారశీకులు, బౌద్ధులకు 87 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు 10 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 9703942423 నంబరులో సంప్రదించాలని సూచించారు.

హింసపై దర్యాప్తునకు సిట్

అనంతపురం క్రైం, మే 17: పోలింగ్ అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై విచారణకు కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను(సిట్) ఏర్పాటు చేసింది. ఐజీ వినీత్ బ్రిజిలాల్ నేతృత్వంలో 13మంది సభ్యులు ఈ బృందంలో ఉన్నారు. తాడిపత్రి అల్లర్లు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. సిట్ నివేదిక తరువాత ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బంది, పోలీసులు, రౌడీమూకలపై చర్యలు తప్పవనే విషయం స్పష్టమవుతోంది.

విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఖరారు



- కే - 6 రకం క్వింటా రూ.9,500
- 40 శాతం సబ్సిడీ వర్తింపు
- రైతు వాటా క్వింటాల్‌కు రూ.5,700
- కదిరి లేపాక్షి రకం.. రూ.8,700
- రైతు వాటా రూ.5,220
- నేటి నుంచి రిజిస్ట్రేషన్



అనంతపురం అర్బన్, మే 17 : విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఎట్టకేలకు ఖరారు చేశారు. కే- 6 రకం వేరుశనగ క్వింటా పూర్తి ధర రూ.9,500గా నిర్ణయించారు. ఈ సారి 40 శాతం సబ్సిడీ వర్తింపజేయనున్నారు. ఈ లెక్కన క్వింటాకు సబ్సిడీ మొత్తం రూ.3,800 పోను రైతు వాటా క్వింటాల్ ధర రూ.5,700 చెల్లించాల్సి ఉంటుంది.

- కదిరి లేపాక్షి రకం వేరుశనగ పూర్తి ధర రూ.8700గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ మొత్తం రూ.3,480 పోను రైతు వాటా క్వింటాల్‌కు రూ.5,220 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా మూడు బస్తాల దాకా పంపిణీ చేయనున్నారు. ఒక్కో రైతుకు అర్ధ ఎకరా దాకా ఒక బస్తా (30కేజీల) విత్తన వేరుశనగ పంపిణీ చేస్తారు. అర్ధ ఎకరా నుంచి ఒక ఎకరా దాకా రెండు బస్తాలు (60 కేజీలు) , ఎకరాపైగా భూమి కలిగిన రైతులకు 3 బస్తాలు (90కేజీలు) పంపిణీ చేయనున్నారు. అలాగే పచ్చిరొట్టే ఎరువులు జీలు, జనుము, పిల్లిపెసరలకు 50 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. వేరుశనగతోపాటు అంతర పంటల ధరలు ఒకే సారి ఖరారు చేస్తామని చెప్పిన రాష్ట్ర ఉన్నతాధికారులు అంతర పంటల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు చేయకపోవడం గమనార్హం.

81,832 క్వింటాళ్ల కేటాయింపు

జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్‌కు 81,832 క్వింటాళ్ల వివిధ రకాలు విత్తనాలు కేటాయించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో వేరుశనగ 76,710 క్వింటాళ్లు కేటాయించారు. కంది 2,300, మినుములు 46, పెసలు 85, రాగి 4, కొర్ర 50, వరి 1600, జీలుగ 200, పిల్లపెసర 25, ఉలవలు 700, అలసంద 106, జనుము 7 క్వింటాళ్ల చొప్పున కేటాయించారు.

పచ్చిరొట్ట ఎరువుల సబ్సిడీ ధరలు

పచ్చిరొట్ట ఎరువులైన జీలు, జనుము, పిల్లిపెసరలకు 50 శాతం సబ్సిడీ వర్తింప జేశారు. జీలుగ క్వింటా పూర్తి ధర రూ.8,800 కాగా 50 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద రూ.4,400 చెల్లించాలి. జనుము పూర్తి ధర రూ.8,800లు కాగా రైతు వాటా కింద రూ.4,400 చెల్లించాల్సి ఉంటుంది. పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.13,400గా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీపోను రైతు వాటా కింద రూ.6700లు చెల్లించాలి.

బస్తాల వారీగా ధరల వివరాలిలా..

వేరుశనగ రకం	మోతాదు	పూర్తి ధర	సబ్సిడీ మొత్తం	రైతు వాటా
కే - 6	బస్తా (30 కేజీలు)	రూ.2850	రూ.1140	రూ.1710
కే - 6	2 బస్తాలు(60కేజీలు)	రూ.5700	రూ.2280	రూ.3420
కే - 6	3 బస్తాలు(90కేజీలు)	రూ.8550	రూ.3420	రూ.5130
కదిరి లేపాక్షి	బస్తా (30 కేజీలు)	రూ.2610	రూ.1044	రూ.1566
కదిరి లేపాక్షి	2 బస్తాలు(60కేజీలు)	రూ.5220	రూ.2088	రూ.3132
కదిరి లేపాక్షి	3 బస్తాలు(90కేజీలు)	రూ.7830	రూ.3132	రూ.4698

నేటి నుంచి రిజిస్ట్రేషన్

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో శనివారం నుంచి విత్తన వేరుశనగ కోసం రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తైన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మండలాల వారీగా విత్తన వేరుశనగ కేటాయింపులు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 71,550 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 31 మండలాలకు విత్తన వేరుశనగను కేటాయించారు. ఆయా మండలాల నుంచి వ్యవసాయ అధికారుల నివేదికల ఆధారంగా వేరుశగను కేటాయించినట్లు సమాచారం. జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్ల పరిధిలోని 31 మండలాలకు విత్తన వేరుశనగ కేటాయించారు. అత్యధికంగా గుమ్మగట్టకు 4500, ఆ తర్వాత బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాలకు 4400 క్వింటాళ్ల చొప్పున, గుత్తి, శెట్టూరు మండలాలకు 4300 చొప్పున కేటాయించారు. రాయదుర్గం 4000, కుందుర్పి 3900 , గుంతకల్లు 3600, రాప్తాడు, వజ్రకరూరు 3000, కణేకల్లు 2700, కూడేరు 2500 క్వింటాళ్లు కేటాయించారు. అత్యల్పంగా పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి మండలాలకు 100 క్వింటాళ్ల చొప్పున కేటాయించారు.

సెట్ అయ్యేదెన్నడో..?

- ఈఏపీ'సెట్' రాయాలంటే పక్క జిల్లాలకు వెళ్లాల్సిందే..
- సరిపడా కంప్యూటర్లు లేవు..
- తల్లిదండ్రుల ఆగ్రహం



అనంతపురం సెంట్రల్, మే 17: అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి చెందిన కాలంలోనూ విద్యార్థులకు పరీక్షా కష్టాలు తప్పడం లేదు. కష్టపడి చదివి పరీక్ష రాస్తామంటే జిల్లాలో కనీసం కంప్యూటర్లు ఏర్పాటు చేయలేని స్థితిలో అధికారులు ఉన్నారంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీటెక్‌లో ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మ-డీ బీఎస్సీలో అగ్రికల్చర్, హార్టికల్చర్, నర్సింగ్ కోర్సుల ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఈఏపీసెట్)ను నిర్వహిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే ఈ పరీక్షలకు తగిన కేంద్రాలను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారు. విద్యార్థులకు స్థానిక ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించాల్సి ఉండగా ఇతర జిల్లాల్లో కేటాయిస్తున్నారు. దీంతో వ్యయ ప్రయాసాలకోర్చి వందల కిలోమీటర్ల దూరంలోని కేంద్రాలకెళ్లి పరీక్షలు రాయాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్న విషయం తెలిసి కూడా విద్యార్థుల సంఖ్యకు సరిపడా కంప్యూటర్లను సమకూర్చి తగిన కేంద్రాలను చేయకపోవడంతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. వేలాదిమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారని అయితే పరీక్షలు రాసేందుకు పనికివచ్చే కంప్యూటర్లు తగినన్ని లేవని అధికారులు వాపోతున్నారు. ఈఏపీసెట్ నిర్వహణలోపం స్పష్టంగా కనిపిస్తోందని, అధికారులు వచ్చే ఏడాదికైనా మారాలని, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

1827 కంప్యూటర్లే...

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఏటా వేలాదిమంది విద్యార్థులు ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే పరీక్షలు కావడంతో తగిన కంప్యూటర్లు ఏర్పాటుచేయాల్సి వుంది. కేవలం 1827 కంప్యూటర్లను మాత్రమే ఏర్పాటుచేసి చేతులు దులుపుకుంటున్నారు. అనంతపురం ఆరు పరీక్షా కేంద్రాల్లో 1175, గుత్తి కేంద్రంలో 250, పుట్టపర్తి కేంద్రంలో 120, తాడిపత్రి కేంద్రాల్లో 300 మొత్తం 1827 కంప్యూటర్లున్నాయి. ఫార్మసీ, అగ్రికల్చర్ రెండు రజులు. ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ నాలుగు రోజుల పాటు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సెషన్‌ల స్లాట్ భర్తీ అయిన తరువాత ఇతర జిల్లాల్లో స్లాట్ కేటాయిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ ప్రారంభం

16న ప్రారంభమైన ఈఏపీసెట్ పరీక్షలు మొదటి రెండురోజు అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమింగ్ పూర్తి అయింది. శనివారం ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు జరిగాయి. అనంతపురంలో ఆరు, తాడిపత్రిలో రెండు కేంద్రాలతోపాటు గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున మొత్తం పది కేంద్రాలను ఏర్పాటు చేశారు. 23వరకు నిర్వహించే పరీక్షలకు మొత్తం 15,948మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఆప్షన్ మేరకే కేటాయింపు

ప్రొఫెసర్ వెంకటరెడ్డి, ఈఏపీసెట్ కన్వీనర్

దరఖాస్తు సమయంలో విద్యార్థులు ఇచ్చుకున్న ఆప్షన్ల మేరకే పరీక్షా కేంద్రాల కేటాయింపు జరుగుతుంది. ఆరు ప్రాంతాలను టెస్ట్ సెంటర్ ప్రిఫరెన్స్ ఆప్షన్‌లో ఇచ్చాము. వారికి సమీప ప్రాంతాలనే ఆప్షన్లు పెట్టుకుంటారు. అయితే ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్న వారి సమీప ప్రాంతాల కేంద్రాల్లో అప్పటికే స్లాట్ పూర్తి అయివుంటే ఆయా ప్రాంతాలు ఆప్షన్లు పెట్టుకోవడానికి కనిపించవు. దీంతో ఇతర ప్రాంతాలను ఆప్షన్లుగా ఇచ్చివుంటారు. మొదటి మూడు ఆప్షన్లకు ప్రాధాన్యమిచ్చి కేంద్రాలు కేటాయించాము. విద్యార్థులు ముందు దరఖాస్తు చేసుకుంటే సమస్య ఉత్పన్నమయ్యే ప్రశ్నే ఉండదు.




ఆధార్‌లేని బతుకులు..!

కొత్తచెరువు, మే 17: ఆ దంపతులు అభాగ్యులు. నిర్భాగ్యులు. ఐదు పదుల వయసొచ్చినా కనీస గుర్తింపు లేదు. ఆధార్ కార్డు కూడా లేదు, రేషన్ కార్డు లేదు. దీంతో ప్రభుత్వ పథకాలేవీ వర్తించవు. చిత్తు పేపర్లు ఏరుకోవడం, గుజిరీకి అమ్ముకోవడం వచ్చిన సొమ్ముతో బతుకు వెల్లదీయడం. తల దాచుకునేకునేందుకు సొంత గూడు లేదు, తినడానికి కడుపునిండా తిండి దొరకదు. ఆలయాల వద్ద, రోడ్డు పక్కన పడుకోవాల్సిందే. తిండి దొరికితే తినడం, లేదంటే పస్తులుండడమే. ఇలాంటి వారి పట్ల పాలకులు, అధికారులు కనీస కనికరం చూపట్లేదు. మండల కేంద్రంలోని ముస్లిం కాలనీలో పాడుబడిన గుడిసెలో నివాసముంటున్న నంజుండ దంపతుల దీనస్థితి ఇది. ఇప్పటి వరకు వారికి ఆధార్‌కార్డు కూడా లేదు. దీంతో ప్రభుత్వ పథకాలు వీరికి అందడంలేదు. పేపర్లు, అట్టపెట్టెలు, సీసాలు సేకరించి, గుజిరీకి వేసి తద్వారా వచ్చే సొమ్ముతో బతుకీడుస్తున్నారు. ఇల్లు లేక ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, దేవాలయాల వద్ద ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఆధార్ కార్డు లేనిదే రేషన్ కార్డు ఇవ్వలేమని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. రేషన్ కార్డు లేకుండా ఇంటి పట్టా మంజూరు చేయలేమంటున్నారు. ఆధార్ కార్డు కోసం కార్యాలయం చుట్టూ తిరిగినా అందుకు అవసరమైన గుర్తింపు కార్డులు లేకపోవడంతో ఆ దంపతులకు మంజూరు చేయలేదు. ఓటరు కార్డు కూడా లేకపోవడంతో పాలకులు, రాజకీయ పార్టీల నాయకులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆ దంపతులకు ఆధార్‌కార్డు మంజూరు చేయించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

నొక్కేశారా?

- పోలింగ్ సిబ్బందికి రెమ్యునరేషన్ చెల్లింపులో తేడాలు
- రిటర్నింగ్ అధికారుల ఇష్టారాజ్యంపై విమర్శలు



అనంతపురం టౌన్, మే 17

- ఎన్నికల విధుల్లో భాగంగా రాప్తాడు నియోజకవర్గంలో పనిచేస్తున్న చాలామంది టీచర్లు, ఇతరశాఖల ఉద్యోగులను మడకశిర నియోజకవర్గానికి పంపారు. అక్కడ పోలింగ్ నిర్వహణ సిబ్బందికి పీఓలు, ఏపీఓలకు రూ.1400, ఓపీఓలకు రూ.500 ఇచ్చి పంపించారు.
- ఆదే శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో పనిచేసిన పీఓలు, ఏపీఓలకు రూ.1650, ఓపీఓలకు రూ.650 ఇచ్చారు.
- ధర్మవరం నియోజకవర్గంలో ఎన్నికల డ్యూటీ చేసిన పీఓలు, ఏపీఓలకు రూ 1400, ఓపీఓలకు రూ.500 ఇచ్చారు.
- అనంతపురం అర్బన్ నియోజకవర్గం జనశక్తి నగర్, తపోవనం, రాజీవ్‌కాలనీలో పనిచేసిన పీఓలు, ఏపీఓలకు రూ.2,050, ఓపీఓలు నలుగురు ఉంటే ఇద్దరికి రూ.1,300, మరో ఇద్దరికి రూ.1,050 ఇచ్చి పంపించారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

పోలింగ్ సిబ్బందికి రెమ్యునరేషన్ చెల్లింపులో తేడాలపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్నిచోట్ల ఎక్కువగా చెల్లించడం, మరికొన్ని చోట్ల తక్కువగా చెల్లించడంపై ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. డబ్బుల కొరతతో ఇలా చేశారా? లేక ఉన్నతాధికారులు మింగేశారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోలింగ్ సిబ్బందిదే. క్షేత్రస్థాయిలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అధికారుల ఆదేశాలను సక్రమంగా అమలు చేసేది వీరే. ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి పోలింగ్ సిబ్బంది ఎంతో శ్రమిస్తారు. ఉమ్మడి జిల్లాలో పోలింగ్ నిర్వహణ కోసం 24,701 మంది పీఓలు, ఏపీఓలు, ఓపీఓలను అధికారులు నియమించారు. ఇందులో శ్రీసత్యసాయి జిల్లాలో 1571 పోలింగ్ కేంద్రాలకు 1873మంది పీఓలు, 1868మంది ఏపీఓలు, 7144మంది ఓపీఓలను నియమించారు. అనంతపురం జిల్లాలో 2236 పోలింగ్ కేంద్రాలకు 2,236 మంది పీఓలు, 2,236 మంది ఏపీఓలు, 8944మంది ఓపీఓలను ఎన్నికల విధులకు కేటాయించారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌కు ఒక పీఓ, ఒక ఏపీఓ, నలుగురు ఓపీఓలు ఉంటారు. ఎన్నికలు ముగిసిన తర్వాత పోలింగ్ సిబ్బందికి రెమ్యునరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. శ్రీసత్యసాయి జిల్లాలో సిబ్బందికి తక్కువగా డబ్బులు ఇచ్చి రిటర్నింగ్ అధికారులు చేతులు దులుపుకున్నారు. కనీసం పీఓ, ఏపీఓలకు ఒక్కొక్కరికి రూ.500నుంచి రూ.600 వందల వరకు కోత పెట్టి పంపారు. అనంత జిల్లాలో మాత్రం పీఓలు, ఏపీఓలకు ప్రతి చోటా రూ.2000 నుంచి రూ.2050 వరకు ఇచ్చారు. అయితే ఓపీఓల రెమ్యునరేషన్ విషయంలో మాత్రం కొందరికి రూ.1050 మరికొందరికి రూ. 1300 ఇచ్చారు. ఇక్కడ మరో విచిత్రమేమిటంటే ఒకే పోలింగ్ కేంద్రంలో నలుగురు ఓపీఓలు పనిచేస్తే అందులో ఇద్దరికి రూ.1050లు, మరో ఇద్దరికి రూ.1300 ఇచ్చారు. ఇది ఎందుకు ఇలా ఇచ్చారో అంతుబట్టని ప్రశ్నగా మిగిలింది.



పోలింగ్ విధుల్లో సిబ్బంది (ఫైల్)

డబ్బు కొరతా... చేతివాటమా?

ఎన్నికల నిర్వహణకు నిధులు పుష్కలంగా విడుదల చేస్తారు. జిల్లా ఎన్నికల అధికారి సైతం నిబంధనల మేరకు ఆయా పనులు నిమిత్తం నిధులు విడుదల చేస్తుంటారు. ఈ నిధులను రిటర్నింగ్ అధికారులు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అయితే పోలింగ్ సిబ్బందికి రెమ్యునరేషన్ ఇవ్వడంలో రిటర్నింగ్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి, చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. మడకశిరకు డ్యూటీ వేసిన ఉద్యోగుల్లో చాలా మంది అనంత జిల్లాకేంద్రంలో నివసిస్తున్నారు. ఇక్కడనుంచి మడకశిరకు ఒకసారి శిక్షణకు, ఎన్నికల రోజు వెళ్లారు. ఇక్కడనుంచి అక్కడకు వెళ్లాలంటేనే బస్సు చార్జీలే దాదాపు రూ.400 అవుతుందంటున్నారు. ఓపీఓలకు రూ.500 మాత్రమే ఇచ్చి పంపితే ఎలా సరిపోతుందో ఎన్నికల ఉన్నతాధికారులే చెప్పాలి. కొందరైతే పోలింగ్‌కు ముందు రోజు బస్సులు లేక కార్లను బాడుగలకు మాట్లాడుకొని ఆయా నియోజకవర్గాలకు వెళ్లారు. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన మేరకైనా రెమ్యునరేషన్ ఇవ్వకపోతే ఎలా అని పోలింగ్‌కు వెళ్లిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అసలు సమస్య ఎక్కడ వచ్చింది.. డబ్బు కొరత వల్ల ఇలా పంపిణీ చేశారా? లేక ఇచ్చిన డబ్బును ఆర్ఓలు, ఇతర అధికారులు నొక్కేశారా? అనే దానిపై ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు విచారించాల్సి ఉంది.

అందుబాటులో టీసీసీ సర్టిఫికెట్లు

అనంతపురం విద్య, మే 17: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు 2023 జూలై పరీక్షల్లో పాసైన అభ్యర్థుల సర్టిఫికెట్లు డీఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హైయర్ గ్రేడ్ టీసీసీ-2023 సర్టిఫికెట్లు వచ్చాయన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లు, పరీక్షల్లో ఉత్తీర్ణులైన కాపీ, ఆధార్‌కార్డ్‌తో కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయానికి వచ్చి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు పొందాలని సూచించారు.

23న ఉద్యోగ మేళా

అనంతపురం క్లాక్‌టవర్, మే 17: అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతీ, యువకులకు స్టైఫండ్‌తో కూడిన ఉచిత టెక్నికల్ శిక్షణ, ఉద్యోగాల భర్తీకి ఈనెల 23న ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి 16-25 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు సంవత్సరాల పాటు తిరుపతి, చిత్తూరుల్లోని అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో శిక్షణ, సర్టిఫికెట్ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామని అన్నారు. ఉచిత వసతి, భోజనం, స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. వివరాలకు 90000 24919, 91004 77371, 77807 52418ను సంప్రదించాలన్నారు.

చీనీకాయలు టన్ను రూ.36 వేలు

అనంతపురంరూరల్, మే 17: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,500, కనిష్ఠంగా రూ.13 వేలు, సరాసరి రూ.23 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మొత్తం 1,074 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

విజయవాడ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంతకల్లు, మే17: గుంటూరు రైల్వే డివిజన్‌లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌కు ఒక అప్ అండ్ డౌన్ సర్వీసును రద్దు చేసినట్లు శుక్రవారం రాత్రి రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ-విజయవాడ (నెం. 17329) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 31న, తిరుగు రైలు (నెం. 17330)ను జూన్ 1న రద్దు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగుల జోరు

నల్లచెరువు, మే 17: ఎన్నికల్లో అభ ్యర్థుల గెలుపు,ఓటమిలపై మండలంలో జోరుగా బె ట్టింగ్‌లు సాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇరు పార్టీల అభ్యర్థులపై భారీగా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు సమాచారం. కదిరి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ గెలుస్తారని కొందరు, అలాగే వైసీపీ అభ్యర్థి మగ్బూల్‌అహమ్మద్ గెలుస్తారని మరికొందరు బెట్టింగ్‌లు వేస్తున్నట్లు సమాచారం. కొంతమంది భూములు సైతం పందేనికి పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఇంకొందరు చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, కాదు జగన్ ముఖ్యమంత్రి అవుతారని బెట్టింగ్‌లు సాగిస్తున్నట్లు సమాచారం. చేతిలో డబ్బులు లేకపోయినా, ఆస్తులు తాకట్టు పెట్టి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

నల్లమాడ: పుట్టపర్తి నియోజకవర్గ కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గెలుపు ఓటములపై మండలంలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నట్లు సమాచారం. అలాగే చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని కొంతమంది, లేదు మరోసారి వైస్ జగనే సీఎం అవుతారని మరికొందరు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులను భారీ మొత్తాల్లో బెట్టింగ్‌లకు కడుతున్నట్లు సమాచారం. అలాగే మోజార్టీపైన కూడా బెట్టింగ్ కడుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై సంబంధితాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

ఆంధ్రజ్యోతి స్పందన

గాండ్లపెంట, మే 17: మండలకేంద్రంలోని సచివాలయంలో ఉద్యోగులు విధులకు సరిగా హాజరు కాకపోవడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం సచివాలయం ఖాళీ అన్న కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ఎంపీడీఓ రామనాయక్ ఆరుగురు సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. గాండ్లపెంటలో సచివాలయంలో ఉద్యోగులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమించాయి. దీనిపై ఉద్యోగులు ఎక్కడికి వెళ్లారో సంజాయిషీ ఇవ్వాలని ఆయన మెమోలు జారీ చేశారు.

వర్షం రాకతో ఉపశమనం



గాండ్లపెంటలో కురుస్తున్న వర్షం

గాండ్లపెంట, మే 17: మండలవ్యాప్తంగా శుక్రవారం ఉదయం మోస్తారుగా వర్షం కురిసింది. దీంతో ఉక్కపోతకు కాస్త ఉపశమనం కలిగినట్టు అయిందని ప్రజలంటున్నారు. ఇటీవల ఏప్రిల్, మేలో ఎండవేడిమి అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు విలవిల్లాడారు. వర్షం ఎప్పుడు పడుతుందా.. అని ఎదురు చూస్తుండగా ఓమోస్తారు వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 8నుంచి 10గంటలవ వరకు వర్షం పడింది. ఈ వ ర్షం ఖరీఫ్ దుక్కులకు కూడా అనుకూలమని రైతులు అంటున్నారు.

మండలానికి చేరిన విత్తన వేరుశనగ



కురమామిడి ఆర్బీకేకు చేరిన విత్తన వేరుశనగ

గాండ్లపెంట, మే 17: ఖరీఫ్‌లో రైతులకు అందించడానికి సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు మండలంలోని ఆర్బీకేలకు వచ్చినట్లు ఏఓ లక్ష్మీప్రియ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో రైతులకు అందించడానికి 4,500 క్వింటాళ్లు అవసరమని నివేదికలు పంపామని, శుక్రవారం కురమామిడి ఆర్బీకేకు వంద క్వింటాళ్లు, గాండ్లపెంట ఆర్బీకేకు వంద క్వింటాళ్లు విత్తన వేరుశనగ వచ్చాయని, అలాగే మండలంలో మిగిలిన ఆర్బీకేలకు త్వరలో వస్తాయని తెలిపారు. రైతులకు పంపిణీ తేదీలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

తనకల్లు, మే 17: జూన్ 4వ తేదీ లోపు పండ్లతోటల పెం పకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పూల నరసింహులు తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 5 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులు ఉపాధి పథకంలో పండ్ల తోటల పెంపకానికి అర్హులున్నారు. వారు జూన్4వతేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మగ్గాల కాలనీకి నీరందిస్తాం

ఆంధ్రజ్యోతి స్పందన

పుట్టపర్తి మే 17: జిల్లాకేంద్రంలోని మగ్గాల కాలనీకి తాగునీటి సరఫరా ను రెండురోజుల్లో పునరిద్ధరిస్తామంటూ మున్సిపల్ కమిషనర్ అంజయ్య పేర్కొన్నారు. మున్సిపాలిటీ బోరు మోటారు మరమ్మతుకు గురి కావడంతో మగ్గాల కాలనీకి నీరు సరఫరా కాకపోవడంపై శుక్రవారం ఆంధ్ర జ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు కమిషనర్ స్పందించారు. బోరు మోటార్‌ను రిపేరి చేయించి వెంటనే కాలనీలో నీటిసరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

బాటిళ్లలో పెట్రోల్ వేయరాదు

హిందూపురం అర్బన్, మే 17: పెట్రోల్ బంకుల్లో బాటిళ్లు, క్యాన్లు, విడిగా పెట్రోల్‌లు వేయరాదని పోలీస్‌శాఖ శుక్రవారం హెచ్చరించింది. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్ వేయాలని, విడిగా ఎవరికైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా విడిగా పెట్రోల్ అడిగితే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు అందించాలన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణ

లేపాక్షి, మే 17: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. దాతలు అందించిన వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని విశేషంగా అలంకరణ చేశారు. తర్వాత స్వామి, అమ్మవారికి అర్చనలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

డ్రైనేజీల్లో చెత్తాచెదారం



విద్యాధరి పాఠశాల వీధిలో నిల్వ ఉన్న మురుగు నీరు



డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

- ముందుకు కదలని మురుగు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

బత్తలపల్లి, మే17: మండలకేంద్రంలోని పలు ప్రాంతాల్లోని వీధులు మురుగునీటితో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా విద్యాధరి పాఠశాల వీధి, ఎస్సీ కాలనీ, మసీద్ వీధిలలో డ్రైనేజీలు చెత్తా చెదారంతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లలేక వీధుల్లో పారుతోంది. అంతేకాకుండా మురుగు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని, పందులు నివాసం ఉంటున్నాయని, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా డ్రైనేజీలు శుభ్రం చేయించడం లేదని అంటున్నారు. పారిశుధ్య కార్మికులు డబ్బు ఇచ్చిన వారి ఇళ్ల ముందు శుభ్రం చేస్తున్నారని, ఇవ్వని ఇళ్ల ముందర శుభ్రం చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీలు శుభ్రం చేయించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పోలింగ్ ముగిసినా విధులకు రాని తహసీల్దార్

- కార్యాలయంలో పనులు జరగక ఇబ్బంది పడుతున్న ప్రజలు



కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

గాండ్లపెంట, మే 17: పోలింగ్ ముగిసి నాలుగురోజులు గడుస్తున్నా మండల తహసీల్దార్ శ్రావణి ఇంతవరకు విధులకు హాజరు కాలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళుతున్నారు. అయితే తహసీల్దార్ రాకపోవడంతో పనులు జరగక నిరాశతో వెనుదిరుగుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో పంట రుణాల రెన్యూవల్‌కు వన్‌బీల లాక్ తీయించుకోవడం కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గత నెలరోజుల నుంచి తహసీల్దార్ ఎన్నికల విధుల నిమిత్తం నిత్యం ఆర్డీవో కార్యాలయంలో ఉండేవారు. అయితే పంట రుణాల కోసం వన్‌బీలను తహసీల్దార్ లాగిన్‌లో లాక్ చేశారు. తహసీల్దార్ రైతులకు అందుబాటులో లేకపోవడంతో రెన్యూవల్ గడువు కాస్తా ముగిసింది. దీంతో సకాలంలో రైతు రుణాలు రెన్యూవల్ చేసుకోలేకపోయారు. పోలింగ్ ముగిసినా తహసీల్దార్, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని మండిపడుతున్నారు. తహసీల్దార్ అందుబాటులో లేక సకాలంలో రుణాలు రెన్యూవల్ చేసుకోలేకపోయామని ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రావణిని ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

ముదిగుబ్బలో అప్రకటిత విద్యుత్ కోతలు

- ఇబ్బందుల్లో ప్రజలు

ముదిగుబ్బ,మే17: అసలే వేసవికాలం ఆపై అప్రకటిత విద్యుత్ కోతలు. దీంతో మండల కేంద్రంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముదిగుబ్బ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. వేసవి కావడంతో ఎండకు భయపడి జనాలు బయటికి రాలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. కరెంట్ పోతుండడంతో ఉక్కపోతకు విలవిల్లాడిపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వినియోగదారులు, రైతులు అనేకసార్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనలు చేసినా.. విద్యుత్ అధికారుల తీరు మాత్రం మారలేదని మండలవాసులు పేర్కొంటున్నారు. విద్యుత్ కోతలతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వెల్డింగ్ షాపు, కూల్‌డ్రింక్ షాప్, జిరాక్స్ సెంటర్, హోటళ్ల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి అద్దె రూముల్లో వ్యాపారాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని, కరెంట్ కోతలతో వ్యాపారం డల్ అవుతోందని, దీంతో అద్దెలు కూడా చెల్లించుకోలేని దుస్థితి పట్టిందని పలువురు వాపోతున్నారు. విద్యుత్ బిల్లులు మాత్రం ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారని, విద్యుత్ కోతలు నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చేయాలని మండలవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై కదిరి విద్యుత్ ఏడీ బాలసుబ్రమణ్యంను వివరణకోరగా సాంకేతిక లోపాల వలన విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని, విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- ప్రజాధనం వృథా
- ఉపయోగంలోకి తేవాలంటున్న ప్రజలు



నిరుపయోగంగా ఉన్న మహిళా కమ్యూనిటీ భవనాలు

ఓబుళదేవరచెరువు, మే 17: మహిళా సంఘాల సమావేశాల కోసం గత 13 ఏళ్ల క్రితం మండల కేంద్రంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అప్పట్లో జడ్పీ నిధులతో వీటిని నిర్మించారు. నిర్మాణానికి అప్పటి జెడ్పీటీసీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి కృషి చేశారు. కాగా ఆ భవనాలను కొద్దిరోజులు మహిళా సంఘాల సమావేశాలకు ఉపయోగించారు. తర్వాత మరికొన్ని రోజులు సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ చేసేందుకు ఉపయోగించారు. ప్రస్తుతం ఎవరూ ఉపయోగించుకోకపోవడంతో నిరపయోగంగా మారాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతోందని పలువురు వాపోతున్నారు. రెండు భవనాలు చెక్కు చెదరకుండా ఉన్నాకూడా వాటిని ఎందుకు ఉపయోగించుకోలేదో అర్థం కావడంలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా ఆ భవనాలు ఉపయోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

మానసిక ప్రశాంతతతోనే రక్తపోటు అదుపు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి జ్యోత్స్న

పుట్టపర్తి రూరల్ మే 17: మానసిక ప్రశాంతతతోనే రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న పేర్కొన్నారు. ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఆమె ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. మానసిక ప్రశాంతతతోనే రక్తపోటు అదుపులో ఉంటుందన్నారు. రక్తపోటు వలన కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలన్నారు. అనవసర ఆలోచనలకు దూరంగా ఉండాలన్నారు. దీంతో రక్తపోటుకు దూరంగా ఉండవచ్చన్నారు. అంతేకాకుండా ఆల్కాహాల్, ధూమపానం వంటి అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ సీడీ , ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత, సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలితకుమారి, తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఈత సాగు అనుకుంటే పొరపాటే..!

పెనుకొండ రూరల్, మే 17: అసలే వేసవికాలం పంటలు రక్షించుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పెనుకొండ మండలం మునిమడుగు గ్రామంలో రైతు దిగువింటి అశ్వత్థనారాయణ ఎకరా పొలంలో అరటి సాగుచేపట్టాడు. ఈ సాగుకు విజయవాడ నుంచి ఒక్కొక్క అరటి పిలకకు రూ.10చొప్పున 2500 పిలకలు కొనుగోలు చేశాడు. కాగా ఎండలు అధికంగా ఉండటంతో వాటిని రక్షించుకోవడానికి వినూత్నంగా ఆలోచించాడు. అరటి పిలకల చుట్టూ ఈతపట్టలు కవచంలా ఏర్పాటు చేశాడు. అవి చూడటానికి ఈత సాగులా అనిపిస్తుంది. కానీ అలా అనుకుంటే పొరపాటే.

మునిమడుగులో అరటి పిలకల చుట్టూ కవచంలా ఏర్పాటు చేసిన ఈత పట్టు →



బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

కొత్తచెరువు, మే 17: మండలకేంద్రంలో శుక్రవారం సంఘమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయని ఆలయ పురోహితుడు సాయి తెలిపారు. తొలుత ధర్మవరం పట్టణానికి చెందిన ఎల్లారి నాగభూషణం వంశపారపర్యంగా బసవేశ్వరుడి చిత్రపటంను తీసుకువచ్చి స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్తలతో కలిసి ఊరేగింపుగా సంఘమేశ్వర ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ పూజలు నిర్వహించి ధ్వజారోహణంతో ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

గంగాభవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు

గాండ్లపెంట, మే 17: మండల కేంద్రంలో వెలసిన గంగాభవారి అమ్మవారి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు 101 బిందెల నీళ్లతో అభిషేకం, ప్రత్యేక అలంకరణలు చేయించారు. అనంతరం కలశపూజ, అష్టోతర పూజలు వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. సాయంత్రం లలితసహస్రనామ పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కళాకారులు చెక్కభజనలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నంబులపూలకుంట, మే 17: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని హెచ్‌ఎం శిరీష తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలతో శుక్రవారం ఆమె విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. 2024-25 విద్యాసంవత్సరంలో పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ప్లస్ 2గా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపీసీకి 40, బైపీసీకి 40సీట్లు ఉంటాయన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లీష్ విద్యాబోధనతో విద్యాభ్యాసము ఉంటుందన్నారు. అవకాశాన్ని మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో కోఎడ్యుకేషన్ ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు కె. శోభారాణి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపీసీలో 40, బైపీసీలో 40సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. జూన్ 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డుపై వర్షపు నీరు నిల్వ

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

నంబులపూలకుంట, మే 17: మండల వ్యాప్తంగా శుక్రవారం ఉదయం మోస్తారు వర్షం కురిసింది. ముఖ్యంగా మండలకేంద్రంలో కురిసిన వర్షానికి కదిరి, రాయచోటి ప్రధాన రహదారిపై నీరు పెద్దఎత్తున నిల్వ ఉంది. ఆ రోడ్డు విపరీతంగా గుంతలు పడి ఉంది. ఆ గుంతల్లో వర్షపు నీరు పెద్దఎత్తున నిలువ ఉంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద అయితే భారీగా వర్షపు నీరు చేరుకుంది. దీంతో వాహదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును మరమ్మతు చేసి ఉంటే ఈ సమస్య ఉండేది కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న కందికుంట వెంకటప్రసాద్

నల్లచెరువు, మే 17: మండలకేంద్రంలోని వీవర్స్‌కాలనీలో గుప్త శ్యామలమ్మ (55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు అంజనప్ప, అశ్వర్థనాయుడు, జక్కా లక్ష్మీనారాయణ, గుప్త రామకృష్ణ, కార్యకర్తలు ఉన్నారు.

రైలు కిందపడి ఆటో డ్రైవర్ మృతి

ముదిగుబ్బ,మే17: మండలంలోని గుంజేపల్లి గ్రామ సమీపంలో రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రాజు(27) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా శుక్రవారం రాత్రి గుంజేపల్లి రైల్వేగేటు సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడి మృతికి గల కారణాలు రైల్వే పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



రాజు(ఫైల్)

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తనకల్లు, మే 17: మండలంలోని పెద్దపల్లి గ్రామం వద్ద శుక్రవారం కర్ణాటక మద్యంను అక్రమంగా తరలిస్తున్న పెండ్లి గుండుతండాకు చెందిన నాగరాజునాయక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్దనుంచి 192 మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధరణీ బాబు తెలిపారు.

తీవ్రమవుతున్న గ్రాసం కొరత..!

● ట్రాక్టర్ గడ్డి రూ.18 వేలు..
● కబేళాలకు తరలుతున్న పశువులు
● ధాన్యం కంటే.. గ్రాసం ధర అధికం

మడకశిర, మే 17: గ్రామీణ ప్రాంతాల్లో గ్రాసం కొరత తీవ్రమవుతోంది. నేటికీ పల్లె ప్రాంతాల్లో కరువు కరాళ నృత్యం చేస్తోంది. గతంలో ఇలాంటి దుర్భర పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కంటే గడ్డి ధర అధికంగా ఉందని రైతులు వాపోతున్నారు. సరిహద్దు ప్రాంతం కర్ణాటకలో కరువు తీవ్రంగా ఉండడంతో అక్కడి ప్రభుత్వం గుర్తించి గడ్డికేంద్రాలు ఎర్పాటు చేసి సబ్సిడీతో పంపిణీ చేస్తోంది. మనప్రాంతంలో కరువు మండలాలుగా గుర్తించినా సబ్సిడీ గడ్డిని పంపిణీ చేయడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేసి పశువులు ఉన్న రైతులకు ఉచితంగా గడ్డిని పంపిణీ చేశారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రెండు నెలలుగా గ్రాసం కొరత తీవ్రంగా ఉంది. పశువులకు మేత సమకూర్చలేక వాటిని పస్తులు ఉంచలేక అప్పులు చేసి గడ్డిని కొనగోలు చేసి వాటి ఆకలి తీర్చుతున్నారు రైతులు. డిమాండును బట్టి గడ్డిధర కూడా ఆకాశాన్ని అంటడంతో కొనలేని పరిస్థితి నెలకుందని రైతులు వాపోతున్నారు. టాక్టర్ గడ్డి రూ.15 వేల నుంచి రూ.18వేల ధర పలుకుతోంది. దీంతో రైతులు గడ్డిని కొనలేక పశువులను కబేళాలకు తరలిస్తున్నారు.


కర్ణాటకలోని గడ్డి కేంద్రంలో మేత మేస్తున్న పశువులు

కర్ణాటక ప్రాంతంలో గడ్డి కేంద్రాలు

సరిహద్దు ప్రాంతమైన కర్ణాటకలో గ్రాసం కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేసి సబ్సిడీతో గడ్డిని అందిస్తున్నారు. ఒక్కో పశువుకు 6 కిలోల గడ్డిని రూ.2తో రైతులకు అందిస్తున్నారు. మిడిగేసి, నాగలమడక తదితర ప్రాంతాల్లో గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేశారు. మన ప్రాంతంలో కూడా గడ్డి విత్తనాలు, దాణా సబ్సిడీతో అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గడ్డి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


లారీలో కర్ణాటక ప్రాంతాలకు వెళుతున్న గడ్డి

తీవ్రమవుతున్న గ్రాసం కొరత

వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు దెబ్బతినడం, దీనికి తోడు రబీలో సాగు అనుకుంత లేకపోవడంతో గ్రాసం కొరత తీవ్రమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయం తరువాత రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రాసం కొరత, దాణా, ఆవుల ధరలు పెరగడంతో ప్రస్తుతం ఉన్న పాల ధరలకు గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు. పాలధరలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పాడి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గతంలో ఎన్నడులేని విధంగా గడ్డి కొరత తీవ్రంగా ఉందని రైతులు చెబుతున్నారు. గతంలో గడ్డి కొరత తీవ్రంగా ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వం గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి పంపిణీ చేసిందని రైతులు గుర్తు చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుని పోయామని, ఈయేడు గతంలో ఎన్నడూలేని విధంగా పంటలు ఎండిపోవడంతో మధ్యలోనే తొలిగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. దీంతో ఆర్థికంగా దెబ్బతిన్నామని గడ్డిని ఉచితంగా అందించాలని రైతులు కోరుతున్నారు.


గడ్డిలేక కాగితాలు మేస్తున్న పశువులు

ట్రాక్టర్ గడ్డి 15వేల నుంచి 18వేలు..

జిల్లాలో ట్రాక్టర్ గడ్డి రూ.15 వేల నుంచి రూ.18వేల వరకు ఉందని రైతులు చెబుతున్నారు. అంత డబ్బు పెట్టి కొనుగోలు చేసే పరిస్థితుల్లో లేమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు గ్రాసం లేకపోవడంతో పాల దిగుబడి తగ్గిపోయిందని అంటున్నారు. దీనికి తోడు పాల ధరలు కూడా లేవని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం దాణాతో పాటు గడ్డి ధరలు కూడా పెరిగాయని, ప్రస్తుతం ఉన్న పాలధరలకు గిట్టుపాటు కావడం లేదన్నారు. ఆవు పాలు లీటరు రూ.35 నుంచి రూ.45 దాకా ఉన్నాయి. వెన్నశాతం బట్టి పాల ధరలను ఇస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో వెన్నశాతం కూడా రావడం లేదని రైతులు అంటున్నారు. వెన్న శాతంతో నిమ్మిం లేకుండా లీటురుకు రూ.50తో కొనగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రాసం కొరతతో ఇబ్బందులు పడుతున్నాం



ఖరీఫ్‌లో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతినింది. కనీసం పశుగ్రాసమైనా దక్కుతుందనుకుంటే అది కూడా వర్షం లేక ఎండిపోయింది. తనకు రెండు ఆవులు ఉన్నాయి. రోజుకు 6 కిలోల చొప్పన 12 కేజీల గడ్డి అవసరం. గడ్డి ధర కూడా పెరిగిపోయింది. కొనలేక పోతున్నాం. పశువులకు మేతలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి పశుగ్రాసమైనా సరఫరాచేయాలి. గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

- రైతు, యంజారప్ప, కాల్వేపల్లి

తుమ్మలమారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, మే 17: మండల కేంద్రంలో వెలసిన తుమ్మలమారెమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


అలంకరణలో అమ్మవారు

దుర్గాదేవికి అలంకరణ

లేపాక్షి, మే 17: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. దాతలు అందించిన వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని విశేషంగా అలంకరణ చేశారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

పెనుకొండలో 91.74 శాతం పోలింగ్

పెనుకొండ టౌన్, మే 17: సార్వత్రిక ఎన్నికల్లో పెనుకొండ అర్బన్ పరిధిలోని 20 వార్డుల్లో అత్యధిక పోలింగ్ 91.74శాతం నమోదైంది. మండలాలవారీగా పోలింగ్ శాతం ఇలా ఉంది. రొద్దం మండలం 40,568 ఓటర్లుండగా 36079మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 18315, మహిళలు 17764మంది 88.93శాతం పోలింగ్ నమోదైంది. పరిగి మండలంలో 46,500 మంది ఓటర్లుండగా పురుషులు 40,538మంది ఓట్లు వేయగా 87.18శాతం నమోదైంది. ఇందులో పురుషులు 20,572, మహిళలు 19,966మంది ఉన్నారు. సోమందేపల్లి మండలం 39,273 మంది ఓటర్లకుగాను 34,321మంది ఓటు హక్కును వినియోగించుకోగా 87.39శాతం నమోదైంది. ఇందులో పురుషులు 17,475, మహిళలు 16846 మంది ఉన్నారు. పెనుకొండ అర్బన్‌లో 23,075మంది ఓటర్లు ఉండగా 21169మంది ఓటు హక్కు వినియోగించుకోగా 91.74శాతం నమోదైంది. ఇందులో పురుషులు 10,722, మహిళలు 10,447మంది ఉన్నారు. పెనుకొండ రూర రల్‌లో 22,138మంది ఉండగా 18,530మంది ఓటు హక్కు వినియోగించుకోగా 83.70శాతం నమోదైంది. పురుషులు 9129, మహిళలు 9400, ఇతరులు ఒకరు ఉన్నారు. గోరంట్లలో 64,432మంది ఓటర్లకుగాను 54,566మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84.69శాతం నమోదైంది. పురుషులు 27,400, మహిళలు 27,165, ఇతరులు ఒకరు ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 117952 మంది పురుషులు, 118030మహిళలు, ఇతరులు నలుగురు ఉండగా వీరిలో పురుషులు 103613మంది, మహిళలు 101588మంది ఇతరులు ఇద్దరు ఓటుహక్కును వినియోగించుకోగా 86.96శాతం పోలింగ్ నమోదైంది.

ఎంఎల్‌హెచ్‌పీ గౌతమిపై కేసు నమోదు

గోరంట్ల, మే 17: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ గౌతమిపై ఆశకార్యకర్త శబరి ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గోరంట్ల పట్టణంలోని 2వార్డులో నివాసమున్న ఆశకార్యకర్త శబరి తనను ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి తరచూ వేధిస్తూ అవమానిస్తుండడతంతో మనోవేదనకు గురై 7వ ఆత్మహత్యాయత్నానికి ప్పాలడిన విషయం తెలిసిందే. సీఐటీయూ ఆధ్వర్యంలో తోటి ఆశకార్యకర్తలు అదే రోజు చర్యలకోసం ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మెడికల్ అధికారి డాక్టర్ శృతి రాజీ చేసే ప్రయత్నం చేసినా ఫలించకపోవడంతో జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌హెచ్ ప్రవర్తన మారకపోవడంతో హిందూపురం ఆసుపత్రిలో చికిత్స అనంతరం శబరి గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను నలుగురిలో తలెత్తుకోకుండా చేయడంతోపాటు ఆత్మహత్యాయత్నానికి కారకులైన గౌతమిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'అదృశ్య సంకెళ్లు'కు బహుమతి


కవి శౌంటి జయప్రకాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, మే 17: రచయిత, కవి శౌంటి జయప్రకాష్ రచించిన అదృశ్య సంకెళ్లు అనే నవలకు బహుమతి దక్కినట్లు తపన సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు సడ్లపల్లి చిదంబరరెడ్డి తెలిపారు. శుక్రవారం టీచర్స్ కాలనీలోని ఆయన స్వగృహంలో కొంత మంది రచయితలతో కలిసి శౌంటి జయప్రకాష్‌ను సన్మానించారు. వారు మాట్లాడుతూ హిందూపురం ప్రాంతంలో రచయితలు చాలా తక్కువ ఉన్నారన్నారు. వారిలో శౌంటి జయప్రకాష్ ఒక్కరన్నారు. ఆయన కథలు, నవలలు, ఆంగ్ల అనువాదాలు పుస్తకాలుగా ముద్రించి రచనా ప్రపంచానికి అందించారన్నారు. ఇందులో అదృశ్య సంకెళ్లు అనే నవలకు అన్వీక్షకి అనే సాహిత్య సంస్థ వారు బహుమతిని అందించారన్నారు. నవలకు బహుమతి అందుకున్న సందర్భంగా సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఆయనకు చిరు సన్మానం చేశారు. రచయిత సిద్దగిరి శ్రీనివాసులు, యువ కవి గంగాధర్, బాలగంగాధర్ తిలక్, నాగమణి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోల్ వేయరాదు

హిందూపురం అర్బన్, మే 17: పెట్రోల్ బంకుల్లో బాటిళ్లు, క్యాన్లు, విడిగా పెట్రోల్‌లు వేయరాదని పోలీస్‌శాఖ శుక్రవారం హెచ్చరించింది. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్ వేయాలని, విడిగా ఎవరికైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా విడిగా పెట్రోల్ అడిగితే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు అందించాలన్నారు.

24 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

అగళి, మే 17: మండలంలో 24 నుంచి జూన్ 3వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12-45గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. 24న తెలుగు, 25న హిందీ, 27న ఇంగ్లీష్, 28న మ్యాథ్స్, 29న ఫిజికల్ సైన్స్, 30న బయాలజీ, 31న సోషల్ స్టడీస్, జూన్ 1న ఫస్ట్ ల్యాంగ్వేజ్ పేపర్ -2 కాంపొజిట్ కోర్సు, జూన్ 3వ తేదీ ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సేవే పరమావధిగా యోగినారాయణ సమితి

హిందూపురం అర్బన్, మే 17: సేవే పరమావధిగా యోగినారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో హిందూపురం సమితి అధ్యక్షుడు రవిశంకర్ నేతృత్వంలో రెండు నెలలుగా బాటసారులకు, వాహనదారులకు శీతల పానీయాలు అందిస్తున్నారు. పట్టణంలోని సాయిబాబా ఆర్చి ఎదురుగా నానెప్ప చత్రం పక్కన ప్రతి రోజు మధ్యాహ్నం మజ్జిగ, రాస్నా, పైనాపిల్‌జూస్, ఆరెంజ్, మ్యాంగో, తదితర శీతల పానీయాలు అందిస్తున్నారు. వేసవి తాపంతో వివిధ పనుల నిమిత్తం పల్లెల నుంచి పట్టనానికి వచ్చే వారు, అటుగా వెళ్లేవారు ఆగి శీతల పానీయాలు తాగి సేదతీరుతున్నారు. అదే విధంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు.

రైలు కిందపడి ఆటోడ్రైవర్ మృతి

ముదిగుబ్బ,మే17: మండలంలోని గుంజేపల్లి గ్రామ సమీపంలో రైలు కిందపడి ఆటోడ్రైవర్ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రాజు(27) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. శుక్రవారం రాత్రి గుంజేపల్లి రైల్వేగేటు సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడి మృతికి కారణాలు రైల్వే పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

రొద్దంలో భారీ వర్షం

● పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం
● రైతుల్లో హర్షం
● ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఉపశమనం

రొద్దం, మే 17: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 5 నుంచి 6 గంటల వరకు వర్షం కురవడంతో ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనానికి ఉపశమనం కలిగినట్లయింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. రెండు పదునుల వర్షం కురవడంతో వాతావరణం చెల్లపడింది. పొలాలు వర్షపునీటితో పరుగులు తీశాయి. ఈ వర్షంతో దుక్కిదున్నుకోవడానికి అనువుగా ఏర్పడటంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

గుడిబండ: గుడిబండ మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. వేసవి సందర్భంగా విపరీతమైన ఎండలు మండుతున్న నేపథ్యంలో వర్షం కురవడంతో కాస్త ఉపశమనం లభించింది. వర్షం కురవడంతో రైతులు తమ పొలాలను దుక్కి చేసుకుంటున్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ కాయల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.


ఆర్. మరువపల్లిలో కురుస్తున్న వర్షం

లేపాక్షి: ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు శుక్రవారం కురిసిన వర్షంతో కాస్త ఊరట లభించింది. మోస్తరు వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. దీంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మరోసారి వర్షం కురిస్తే పొలాల్లో రైతులు దుక్కి దున్నేందుకు సిద్ధమవుతున్నారు.

హిందూపురం: వేసవి తాపంతో నాలుగు నెలలు విలవిల లాడిన ప్రజలు శుక్రవారం సాయంత్రం కురిసిన చిరు జల్లులకు ఊరట పొందారు. ఉదయం నుంచి ఉక్కపోతతో తల్లడిల్లారు. సాయంత్రం చల్లగాలితో కూడిన చిరు జల్లులతో ఇక వేసవి వెళ్లిపోయిందని ఆనందపడ్డారు. నెలాఖరులో రుతుపవనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇక వేసవి పూర్తిగా వెళ్లిపోయిందని ఉక్కపోతలు ఉండవని పరవశం పొందారు.

ముదిగుబ్బలో అప్రకటిత విద్యుత్ కోతలు

● ఇబ్బందుల్లో ప్రజలు

ముదిగుబ్బ,మే17: అసలే వేసవికాలం ఆపై అప్రకటిత విద్యుత్ కోతలు. దీంతో మండల కేంద్రంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముదిగుబ్బ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. వేసవి కావడంతో ఎండకు భయపడి జనాలు బయటికి రాలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. కరెంట్ పోతుండడంతో ఉక్కపోతకు విలవిల్లాడిపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వినియోగదారులు, రైతులు అనేకసార్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనలు చేసినా.. విద్యుత్ అధికారుల తీరు మాత్రం మారలేదని మండల వాసులు పేర్కొంటున్నారు. విద్యుత్ కోతలతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వెల్డింగ్ షాపు, కూల్‌డ్రింక్ షాప్, జిరాక్స్ సెంటర్, హోటళ్ల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి అద్దె రూముల్లో వ్యాపారాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని, కరెంట్ కోతలతో వ్యాపారం డల్ అబుతోందని, దీంతో అద్దెలు కూడా చెల్లించుకోలేని దుస్థితి పట్టిందని పలువురు వాపోతున్నారు. విద్యుత్ బిల్లులు మాత్రం ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారని, విద్యుత్ కోతలు నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చేయాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై కదిరి విద్యుత్ ఏడీ బాలసుబ్రమణ్యంను వివరణకోరగా సాంకేతిక లోపాల వలన విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని, విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

పోలింగ్ ముగిసినా విధులకు రాని తహసీల్దారు

● కార్యాలయంలో పనులు జరగక ఇబ్బంది పడుతున్న ప్రజలు

గాండ్లపెంట, మే 17: ఎన్నికలు ముగిసి నాలుగురోజులు గడుస్తున్నా మండల తహసీల్దార్ శ్రావణి ఇంతవరకు విధులకు హాజరుకాలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళతున్నారు. అయితే తహసీల్దార్ రాకపోవడంతో పనులు జరగక నిరాశతో వెనుదిరుగుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో పంట రుణాల రెన్యూవల్‌కు వన్‌బీలు లాక్ తీయించుకోవడం కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గత నెలరోజుల నుంచి తహసీల్దార్ ఎన్నికల విధుల నిమిత్తం నిత్యం ఆర్వీవో కార్యాలయంలో ఉండేవారు. అయితే పంట రుణాల కోసం వన్‌బీలను తహసీల్దార్ లాగిన్‌లో లాక్ చేశారు. తహసీల్దార్ రైతులకు అందుబాటులో లేకపోవడంతో రెన్యూవల్ గడువు కాస్తా ముగిసింది. దీంతో సకాలంలో రైతులు రుణాలు రెన్యూవల్ చేసుకోలేకపోయారు. పోలింగ్ ముగిసినా తసీల్దార్, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని మండిపడుతున్నారు. తహసీల్దార్ అందుబాటులో లేక సకాలంలో రుణాలు రెన్యూవల్ చేసుకోలేకపోయామని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రావణిని ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.


కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

విద్యుత్ లైను మార్చాలని డీఈకి వినతి

గుడిబండ, మే 17: మండలంలోని జమ్ములబండ గ్రామంలో ఇంటి మిద్దెపై ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చాలని బహుజన చైతన్యవేదిక నాయకులు హిందూపురం ట్రాన్స్‌కో డీఈకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శివరామక్రిష్ణ, గౌరవాధ్యక్షులు వెంకటేశులు, వృద్దంబాబు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, సభ్యులు రాజశేఖర్ తదితరులతో కలిసి శుక్రవారం డీఈని కలిశారు. వారు మాట్లాడుతూ జమ్ములబండ గ్రామంలో ఇళ్లపైనే హైటెన్షన్ విద్యుత్‌వైర్లు పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు.ఇంటిపైన నిలబడితే చేతికందే ఎత్తులో ఉండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. 2022లో ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతి చెందాడని డీఈకి వివరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ లైనును మార్చాలని వారు కోరారు. డీఈ స్పందించి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు.


ఇంటి మిద్దెపై వెళ్లిన హైటెన్షన్ విద్యుత్ వైర్లు


ట్రాన్స్‌కో డీఈకి వినతిపత్రం ఇస్తున్న బహుజన చైతన్యవేదిక నాయకులు

పూడికతీత పనులను వినియోగించుకోండి



పూడికతీత పనులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మేరీవటమట్టం

రొద్దం, మే 17: చెరువుల్లో పూడికతీత పనులను చేపడుతున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టింబక్టివ్ కలెక్టివ్ వ్యవస్థాపకురాలు మేరీ వటమట్టం కోరారు. శుక్రవారం కోగిర గ్రామంలోని చెరువుల్లో పూడికతీత పనులను ఎక్స్‌కవేటర్‌తో ప్రారంభించారు. రాయలసీమ వాటర్‌ప్రాజెక్ట్ కార్యక్రమం ద్వారా రొద్దం, రామగిరి, చెన్నెకొత్తపల్లి మండలాల్లోని 12 గ్రామ పంచాయతీల్లో ఉన్న 16గ్రామాల చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. రొద్దం మండలంలోని కోగిర, శ్యాపురం, బీదానిపల్లి, కంబాలపల్లి, రాచూరు, దొడగట్ట, చెరుకూరు, రొద్దం గ్రామాలలో పూడికతీత పనులు చేపడతామన్నారు. కోగిర గ్రామంలో చెరువుకట్ట మరమ్మతులు, పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. దీనిద్వారా రైతు పొలాలకు మట్టి తరలింపు, చెరువుల్లో నీటి నిల్వ రైతుల పంటలకు ఆదాయం వస్తుందన్నారు. రాయలసీమ వాటర్‌ప్రాజెక్ట్ మేనేజర్ పేరూరి శ్రీకాంత్, నాగరాజు, రాము పాల్గొన్నారు.

ఈతవనం కాదు..


మునిమడుగులో అరటి పిలకల చుట్టూ కవచంలా ఏర్పాటు చేసిన ఈత పట్టు

పెనుకొండ రూరల్, మే 17: అసలే వేసవికాలం పంటలు రక్షించుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పెనుకొండ మండలం మునిమడుగు గ్రామంలో రైతు దిగువింటి అశ్వత్థనారాయణ ఎకరా పొలంలో అరటి సాగుచేపట్టాడు. విజయవాడ నుంచి తనకున్న ఎకరా పొలంలో అరటిపంట సాగుచేసేందుకు రూ.10చొప్పున 2500మొక్కలు కొనుగోలు చేశాడు. ఎండలు అధికంగా ఉండటంతో మొక్కలను రక్షించుకోవడానికి వినూత్నంగా ఆలోచించాడు ఈ రైతు. అరటి మొక్కలకు చుట్టూ ఈతపట్టలు కవచంలా ఏర్పాటు చేశాడు. అవి చూడటానికి ఈత సాగు అనుకుంటే పొరపాటే.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నంబులపూలకుంట, మే 17: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని హెచ్‌ఎం శిరీష తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలతో శుక్రవారం ఆమె విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. 2024-25 విద్యాసంవత్సరంలో పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ప్లస్ 2గా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపీసీకి 40, బైపీసీకి 40సీట్లు ఉంటాయన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లిష్ విద్యాబోధనతో విద్యాభ్యాసము ఉంటుందన్నారు. అవకాశాన్ని మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో కోఎడ్యుకేషన్ ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు కె. శోభారాణి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపీసీలో 40, బైపీసీలో 40సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. జూన్ 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గెలుపోటములపై బెట్టింగుల జోరు

నల్లచెరువు, మే 17: ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు,ఓటమిలపై మండలంలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇరు పార్టీల అభ్యర్థులపై భారీగా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు సమాచారం. కదిరి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ గెలుస్తారని కొందరు, అలాగే వైసీపీ అభ్యర్థి మగ్బూల్‌అహమ్మద్ గెలుస్తారని మరికొందరు బెట్టింగ్‌లు వేస్తున్నట్లు సమాచారం. కొంతమంది భూములు సైతం పందేనికి పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఇంకొందరు చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, కాదు జగన్ ముఖ్యమంత్రి అవుతారని బెట్టింగ్‌లు సాగిస్తున్నట్లు సమాచారం.

నల్లమాడ: పుట్టపర్తి నియోజకవర్గం కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గెలుపు ఓటములపై మండలంలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నట్లు సమాచారం. అలాగే చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని కొంతమంది, లేదు మరోసారి వైస్ జగనే సీఎం అవుతారని మరికొందరు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులను భారీ మొత్తాల్లో బెట్టింగ్‌లకు కడుతున్నట్లు సమాచారం. అలాగే మోజార్టీపైన కూడా బెట్టింగ్ కడుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై సంబంధితాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.